క్లుప్తంగా

ప్రశాంతంగా బీఈడీ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 16 కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు 3,519 మంది విద్యార్థులకు గాను 3,174 మంది హాజరయ్యారన్నారు.

తెలంగాణ ఎన్నికల్లో లబ్ధికి కుట్ర

కర్నూలు(సెంట్రల్) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో లబ్ధి పొందేందుకు కృష్ణా జిలాల పంపిణీపై పునః సమీక్ష పేరుతో కుట్ర పన్నుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 811 టీఎంసీల నీటిని కేటాయించిందన్నారు. ఏపీ విభజన తరువాత ఏపీకి 511 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను పంపిణీ చేసిందని, తాజాగా రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా నీటి వివాదం సృష్టించిందని విమర్శించారు.

క్లాప్ డ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మునిసిపల్ కార్పొరేషన్‌లో చెత్త సేకరణ ఆటోల డ్రైవర్లు (క్లాప్)గా పనిచేసిన వారందరినీ విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. ఇటీవల 15 రోజుల క్రితం పెండింగ్ జీతాలు అడిగిన వారందరినీ ఉద్యోగాల నుంచి తొలగించారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. శుక్రవారం సుందరయ్య సర్కిల్‌లో ఆ యూనియన్ ఆధ్వర్యంలో క్లాప్ డ్రైవర్లకు మద్దతుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..10 నెలల పెండింగ్ జీతాలు ఇవ్వమని అడిగితే ఉద్యోగాల నుంచి తొలగించడం కమిషనర్‌కు భావ్యం కాదన్నారు. కార్యకరమంలో నాయకులు ఆర్.నరసింహులు, సాయిబాబా, మారెళ్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్) : నగర పరిధిలోని బండిమెట్ట ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు ఎం.షరీఫ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇంటింటికీ సీపీఎం కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ బృందం బండిమెట్టలో పర్యటించింది. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంది. 15 రోజులకు ఒకసారి కాలువలను శుభ్రం చేస్తుండడంతో కంపు కొడుతున్నాయని, వారానికి ఒక్క సారి కాలువలను శుభ్రం చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గౌస్, వీరేష్, నాగేంద్ర, బాష, నూరు బాషా పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): రాహుల్‌గాంధీని రావణుడిలా చిత్రీకరించి పోస్టర్లు వేయడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. పార్టీ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు మాట్లాడుతూ..బీజేపీ నాయకులు వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామని తెలిసి పిచ్చి వేషాలు వేస్తున్నారన్నారు. ఎవరూ ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలిచి రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు జాన్ విల్సన్, సత్యనారాయణ గుప్తా, బతుకన్న, బజారన్న, వెంకట సుజాత, అమరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె.లలితమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణలో కంటే ఏపీలో అంగన్‌వాడీలకు 1000 రూపాయలు ఎక్కువగా జీతం ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

'ఉపాధి'లో అక్రమాలకు పాల్పడితే చర్యలు

ఆలూరు రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆలూరు సీఎల్ఆర్‌సీ భవనంలో.. ఏడాది కాలంలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2022–23 ఏడాదికి సంబంధించి ఆలూరు ఎన్ఆర్ఈజీఎస్ ప్రాజెక్టు పరిధిలో 997 పనులు చేపట్టామన్నారు. ఉపాధి హామీ పథకం కూలీల పనులకు రూ.7 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ పనులకు రూ.1.80 కోట్లు ఖర్చే చేసినట్లు చెప్పారు. ఈ పనుల్లో సరైన ఆధారాలు లేనందున రూ.1.30 లక్షలు రికవరీ చేసినట్లు తెలిపారు. డ్వామా అడిషనల్ పీడీ సలీ బాషా, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ లోకేష్, స్టేట్ టెక్నీషియన్ మేనేజర్ లోకేశ్వర్ రెడ్డి ఉన్నారు.





గడ్డవీధిలో వైద్యశిబిరానికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ , బీపీ చెక్ చేస్తున్న సిబ్బంది



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు



మందులు అందజేస్తున్న దృశ్యం

పైసా ఖర్చులేకుండా వైద్య సేవలు

- ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం
- కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్
- 6, 7 వార్డుల్లో ఉచిత మెడికల్ క్యాంప్‌లు

కర్నూలు (టౌన్) : ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలని పైసా ఖర్చులేకుండా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తుందని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక కమేలా, గడ్డ ఏరియా పరిధిలోని 6, 7 వ వార్డులకు సంబంధించి వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపునకు హాజరైన వారికి ఉచితంగా బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, మూత్ర, మలేరియా, డెంగీ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు. నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు షేక్ నీలోఫర్, జుబేర్ అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులో సేవలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

ఆరోగ్య సురక్షతో పేదలకు రక్ష

కర్నూలు(హాస్పిటల్): ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వైద్యశిబిరాలు పేదలకు ఆరోగ్యపరంగా రక్షణ కల్పిస్తాయని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన నగరంలోని గడ్డవీధిలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, కేస్ షీట్‌ల జారీ, ల్యాబ్ పరీక్ష, మెడికల్ ఆఫీసర్ల కౌంటర్లు, మందులు ఇచ్చే కౌంటర్లు, స్పాట్ సర్వే కౌంటర్, తాగునీటి కౌంటర్‌లను పరిశీలించారు. మందుల జారీ, వైద్యుల చికిత్స, వైద్యపరీక్షల నిర్వహణ గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యశిబిరానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. ఆయన వెంట యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు, స్పెషలిస్టు వైద్యులు, రెవెన్యూ అధికారులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

బి.తాండ్రపాడు గ్రామంలో...

నగర శివారులోని బి. తాండ్రపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ అధికారిని హేమలత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య సమస్యలు ఉన్న వారికి ఈ కార్యక్రమం గొప్ప అవకాశం అని చెప్పారు. ఇక్కడ ఎంతో ఖరీదైన మందులు, స్పెషలిస్టులతో చికిత్స ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు కూడా నిర్వహిస్తారన్నారు. ఈ క్యాంపు ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ బి. జయలక్ష్మి, డాక్టర్ ఎస్వీ రామమోహన్‌రెడ్డి, డాక్టర్ సింధూర, డాక్టర్ రాఘవ, డాక్టర్ హెచ్‌ఎస్. ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కర్నూలు సిటీ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ కోరారు. శుక్రవారం కర్నూలు మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అనంతరం వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం కింద కళ్ల అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్ఆర్‌సీపీ నాయకులు పి.చిన్న లక్ష్మన్న, మోహన్‌బాబు, సచివాలయ కన్వీనర్ పి.ఫిరోజ్‌ఖాన్, మునెప్ప పాల్గొన్నారు.

మందులు కూడా ఇచ్చారు



మాది పేద కుటుంబం. చిన్నపాటి రోగం వచ్చినా బయట చూపించుకునే ఆర్థిక పరిస్థితి లేదు. అలాంటి మాకు వైద్య శిబిరం పెట్టి ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. ఒక్క రూపాయి తీసుకోలేదు. బీపీ, షుగర్‌కు మందులు కూడా ఉచితంగా ఇచ్చారు.మా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్న జగన్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– మాబున్నీ, కమేల్లా

సంతోషంగా ఉంది



మా ఇళ్ల దగ్గరికే వైద్యులు వచ్చి వైద్య సేవలు అందిస్తారు అంటే మొదట్లో నమ్మలేదు. శిబిరంలో చాలా ఓపికగా ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. పైసా కూడా తీసుకోలేదు. ఇంట్లో వాళ్లు కూడా పట్టించుకోని ఈ రోజుల్లో ప్రభుత్వం మా కోసం మెడికల్ క్యాంపులు నిర్వహించి సేవలు అందించడం సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వం వల్ల మాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుంది.

– చాంద్‌బీ, గడ్డ వీధి

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి



నరసింహులు (ఫైల్ ఫొటో)

కర్నూలు: ఆత్మహత్యాయత్నం చేసుకున్నగూడూరు మండలం పొన్నకల్లు గ్రామానికి చెందిన కురువ నరసింహులు (49) అనే వ్యక్తి కోలుకోలేక గురువారం రాత్రి మృతిచెందాడు. ఈయన భార్య కురువ లక్ష్మి.. కుమారుడు చదువు కోసం ఏడాది కాలంగా కర్నూలులోని రామలింగేశ్వరనగర్‌లో తల్లి గౌరమ్మ తో కలసి ఉంటుంది. నరసింహులు ఊరి వద్ద వ్యవసాయ పనులు చూసుకుంటూ ఆటో తోలుతూ తరచూ కర్నూలుకు వచ్చి వెళ్లేవాడు. ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పు చెల్లించలేక ఈనెల 2వ తేదీ రాత్రి కర్నూలులో భార్య ఉంటున్న ఇంట్లో తాడుతో ఉరి వేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి చుట్టుపక్కల వారి సహాయంతో కిందకు దించి అంబులెన్స్‌లో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే, కోలుకోలేక గురువారం రాత్రి మృతిచెందాడు. ఇంటి నిర్మాణం కొరకు చేసిన అప్పులు చెల్లించలేక తన భర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య కురువ లక్ష్మి ఫిర్యాదుతో నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ రోజు

సన్నాహక సమావేశం

కర్నూలు(అర్బన్): ఈ నెల 20న విజయవాడ ఉండవల్లి రాజగృహ ప్రాంగణంలో జరిగే డా.బీఆర్ అంబేడ్కర్ పాలరాతి మందిరం ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోన నాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంక్షేమ సంఘం ఏర్పాటై 80 వసంతాలు పూర్తి అయినందున అంబేడ్కర్ పాలరాతి మందిరం ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ సెమినార్

కర్నూలు కల్చరల్: ఉస్మానియా కళాశాలలో శనివారం ఉదయం 10 గంటలకు జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నట్లు కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు, సెమినార్ కన్వీనర్ డాక్టర్ మండి అన్వర్ హుసేన్ తెలిపారు. 'సయ్యద్ సలీమ్ సాహిత్యం – సామాజిక చైతన్యం' అనే అంశంపై సెమినార్ జరుగుతుందని పేర్కొన్నారు. సెర్ఫ్ సీఈఓ, సీసీఎల్ఏ అడిషినల్ కమీషనర్, మైనార్టీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.ఎండి. ఇంతియాజ్, ఇన్‌కమ్ ట్యాక్స్ విశ్రాంత అడిషినల్ కమిషనర్ సయ్యద్ సలీమ్, కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ ఆజ్రాజావెద్, హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ విశ్రాంత హెచ్‌ఓడీ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

పురాతన కట్టడాల పరిరక్షణకు కమిటీ

కర్నూలు(అర్బన్): కల్లూరు మండలంలోని పురాతన కట్టడాలను పరిరక్షించేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు బీసీ జనసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.శేషఫణి చెప్పారు. శుక్రవారం స్థానిక బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని నాయకల్లు గ్రామంలో క్రీస్తు పూర్వం అశోకుని కాలంలో నిర్మించిన బౌద్ధమతం కట్టడాలను బంగారు నిధుల కోసం జేసీబీలు పెట్టి ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారికి రెవెన్యూ, ఎండోమెంట్ అధికారులు సహకారం అందిస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారన్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయని, ఆయా శాఖలకు చెందిన అధికారుల నిర్లక్ష్యం వల్ల తిరిగి పునరావృతం అవుతున్నాయన్నారు. సర్వే నెంబర్: 50లోని 68 సెంట్ల భూమిని కొలతలు వేసి పరిరక్షించాలన్నారు. సమావేశంలో ఎస్కే జయన్న, పట్నం రాజేశ్వరి, శేషగిరి, యాగంటయ్య, మాదేశ్, వసంత్, బాలన్న, సుధాకర్, శ్రీనివాసులు, వెంకటస్వామి, శేఖర్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం వ్యక్తం చేస్తున్న కమిటీ నేతలు

ప్రజల మన్ననలు పొందండి



సన్మానించిన లైన్‌మెన్లతో విద్యుత్ అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-1 రాజమోహన్‌రెడ్డి అన్నారు. జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 (సచివాలయ)లను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే క్రమబద్ధీకరించింది. శుక్రవారం రాత్రి సెంట్రల్ సెక్షన్‌లో పనిచేస్తున్న జేఎల్ఎంలను జిల్లాపరిషత్‌లో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జాన్ బెర్నార్డ్, లైన్‌మెన్ లక్ష్మయ్య, జేఎల్ఎంలు మద్దిలేటి, జనార్దన్, బెస్త రవి, మల్లికార్జున, నాగేంద్ర, శేషాద్రి ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

క్రీడల్లో ప్రతిభ చాటండి



స్విమ్మింగ్ పోటీలను పరిశీలిస్తున్న ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి పద్మావతి

కర్నూలు (టౌన్) : చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటితే విద్యా, ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 జిల్లా కార్యదర్శి పద్మావతి స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక కిసాన్‌ఘాట్ వద్ద ఉన్న స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్‌లో జూనియర్ కళాశాలల విద్యార్థులకు స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్ పోటీలు

నగరంలోని స్థానిక అశోక్‌నగర్‌లో ఉన్న ఆర్కే అకాడమీలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఎస్‌జీఎఫ్ అండర్ -19 కార్యదర్శి పద్మావతి మాట్లాడుతూ ఈ పోటీల్లో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి బాల బాలికలు పాల్గొన్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా తరఫున ప్రతిభ చాటాలని పిలుపు నిచ్చారు.

జగనన్న వస్తేనే మరింత లబ్ధి

- గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాల అమలు
- బాబు వస్తే పథకాలను ఎత్తేస్తారు
- ప్రతి ఇంటికి వెళ్లి నాటి, నేటి ప్రభుత్వ పనితీరును వివరించండి
- పథకాలు కొనసాగాలంటే వైఎస్ఆర్‌సీపీ మళ్లీ రావాలని చెప్పండి
- ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..? కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



హాజరైన పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు

కర్నూలు(రాజ్‌విహార్): మళ్లీ జగనన్న అధికారంలోకి వస్తే పేదలకు మరింత లబ్ధి చేకూరుతుందని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వమే రావాలన్నారు. శుక్రవారం స్థానిక పాత బస్తీలోని పార్టీ కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..? (వై ఏపీ నీడ్ జగన్) అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు, పార్టీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని చెప్పారు. ముఖ్యంగా విద్య, వైద్యం, సంక్షేమానికి అయన విశేష కృషి చేస్తున్నారన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వివిధ వర్గాలకు ప్రజలకు మేలు చేస్తున్నారన్నారు. అదే చంద్రబాబు అధికారంలోకి వస్తే ఆయా పథకాలను ఎత్తేస్తారన్నారు. పేదల సంక్షేమం ఆయనకు పట్టదన్నారు. ఇందుకు బాబు గత పాలనే ఉదాహరణ అన్నారు. ఈ విషయాన్ని ఇంటింటికి వెళ్లి ప్రజలకు చెప్పాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో 175 స్థానాల్లో గెలవాలన్నదే జగనన్న లక్ష్యమని చెప్పారు. కర్నూలు అంటే సీఎంకు ప్రత్యేక అభిమానమన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణయ్మతో పాటు క్లస్టర్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు

పథకాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం స్థానిక 23వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శ్రీరామ్ నగర్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. అలాగే స్థానిక సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

జిల్లా అభివృద్ధిపై చర్చ



మంత్రి గుమ్మనూరు జయరాంతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

ఆలూరు: జిల్లా సమగ్రాభివృద్ధి, పాలనపై శుక్రవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన చర్చించారు. శుక్రవారం మంత్రిని ఆయన నివాసంలో కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రితో ఇంటింటికీ తాగునీరు, ప్రాజెక్టులు, రోడ్లు, జగనన్న గృహాలు, ఎల్లెల్సీ, హెచ్ఎల్సీ, వివిధ అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు. రోడ్ల నిర్మాణం, తాగునీటి సదుపాయం, రిజర్వాయర్ల పనులు, కళాశాలల మంజూరు, శాశ్వత భవనాలు వంటివి పూర్తయితే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని వివరించారు. అలాగే గ్రామాల్లో ఇళ్లు లేని వారిని స్థలాలను మంజూరు చేయాలని మంత్రి కలెక్టర్‌ను కోరారు.

సమాజానికి ఉపయోగపడేలా విద్య ఉండాలి



మాట్లాడుతున్న ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర నాయకుడు ఎం.సుబ్రమణ్యం

కర్నూలు సిటీ: సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యలో మార్పులు రావాలని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) రాష్ట్ర నాయకులు ఎం.సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు టి.వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం ఉన్నత విద్యలో మార్పులు-నాలుగేళ్ల డిగ్రీ, భవిష్యత్తుపై ప్రభావం అనే అంశంపై ఏఐఎస్ఈసీ ఆధ్వర్యంలో టీజీ కళా క్షేత్రంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారితో పాటు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డా.ఎం నాగరాజు, బార్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఓంకార్ యాదవ్ పాల్గొని ప్రసంగించారు. నాలుగేళ్ల డిగ్రీ ఉన్నత విద్యలో మౌలిక సూత్రాలు దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఈసీ జిల్లా కార్యదర్శి హరీష్‌కుమార్ రెడ్డి, బీటీఏ అధ్యక్షుడు డి.రామశేషయ్య, రిటైర్డ్ అధ్యాపకులు రమేష్, నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ నాయకులు బాలన్న, జనవిజ్ఞాన వేదిక నాయకులు కె.శేషాద్రిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూ సెంట్రల్ లైబ్రరీ పరిశీలన

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం సెంటర్ లైబ్రరీలో ఉపయోగించిన ఫర్నిచర్ నాణ్యతను శుక్రవారం నిజనిర్ధారణ కమిటీ పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్ ఈ ప్రొక్యూర్‌మెంట్ సంబంధించి ఏ రాష్ట్రాల నుంచి ఎన్ని టెండర్లు కోట్ చేశారనే దానిపై శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ డి.రవీంద్రర్, ట్రిపుల్ ఐటీ మెకానికల్ విభాగాధిపతి కృష్ణయ్య ఆధ్వర్యంలోని కమిటీ తనిఖీ చేసినట్లు లైబ్రరీ ఇన్‌చార్జ్ ఎస్.నాగభూషణం తెలిపారు. లైబ్రరీ ఫర్నిచర్ కొనుగోలు కమిటీ సభ్యులు ప్రొఫెసర్లు నరహింహులు, హరిప్రసాద్ రెడ్డి, సతీష్ కుమార్ ఉన్నారు.

భ్రమరాంబాదేవికి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం 7గంటలకు ప్రారంభమైన సేవలో భాగంగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు ముందుగా సేవా సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ చేశారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఆశీనులను చేసి షోడశోపచార పూజలను నిర్వహించిన అనంతరం అమ్మవారికి అష్టోత్తరం, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే శ్రీశైలగ్రామ దేవతగా పిలవబడుతున్న అంకాళమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

శ్రీశైలంలో అద్భుత తీర్థాలు

- సామవేదం షణ్ముఖ శర్మ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని ఆలయ ప్రాంగాణం, ఆలయ పరిసరాల్లో అద్భుతమైన తీర్థాలు ఉన్నాయని, వాటి దివ్యత్వాన్ని పురాణాలు ఎంతగానో వర్ణించాయని ప్రముఖ ప్రవచకులు బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ తెలిపారు. శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళావేదికపై ఆయన శ్రీశైల మహిమా విశేషాలపై ఆరవ రోజు ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

'సుంకేసుల'కు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి శుక్రవారం 970 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 817 క్యూ సెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యామ్ అధికారులు తెలిపారు. డ్యామ్‌లో 1.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది.